# ఆడపడుచు

అప్పుడే తెల్లవారింది.

తూర్పుదిక్కున సూర్యుని బంగారు శ్వేతకిరణములు భూమిపై ప్రసరించి, చీకటిని తొలిగించి, వెలుగును ప్రసారించి ప్రకృతి బంగారు కవచమును ధరించిందా అనునట్లున్నది. వాతావరణము చాలా ప్రశాంతముగా యున్నది. చల్లనిగాలులు వీచి మానవులకు మత్తెక్కించుచున్నవి. పక్షులు తమ అరుపులతో తెల్లవారింది సుమా అని సూచించుచున్నవి. పశువుల అరుపులు, శకటముల రొదలు, పాలవాళ్ళ అరుపులతో రోడ్లన్ని చాలా గోలగా వున్నవి.

అటువంటి ప్రశాంత వాతావరణములో లక్ష్మి నిద్ర నిద్రలేచి తన ఇంటిపనులను చక్కబెట్టుకొనుచున్నది.

'లక్ష్మి ఇంకా కాఫిచేయలేదా' అంటూ మాధవి వంటయింటిలోనికి వచ్చినది,

లేదు వదినా ఇదిగో అయిపోవచ్చుచున్నది అంటూ ఐదునిముషాలలో కాఫీకలిపి అందరికి యిచ్చినది.

లక్ష్మి స్టౌమీద ఎసరుపడేసి కూరగాయల సంచి ముందువేసుకొని తరగ నారంభించినది.

నేను ఈవేళ త్వరగా ఆఫీసుకు వెళ్ళాలి కాస్త వేగముగా వంటచేసేయి లక్ష్మి అంటూ విసురుగా తన గది లోనికి వెళ్ళిపోయింది మాధవి.

హు! వేగిరం వంటకావాలంటుంది కాని తన ఆరోగ్యము సంగతి కొంచమైన ఆలోచించిందా? తనకు రాత్రి జ్వరముగావుంటే ఒక్కసారైన పలుకరించిందా? పోన్లే వదినే కదా? పైవాళ్ళు ఎవరుకాదు కదా? పెట్టినా కొట్టినా ఫరవాలేదు అని మనసు నిగ్రహించుకొని చకచకా పనులలో నిమగ్నమై పోయింది.

టైము తొమ్మిది గంటలయినది.

లక్ష్మి త్వరగా వడ్డించేయి, అయ్యో! నామతి మండ బాత్ రూములో చీరెలు అవి ఆరవేయకుండా అలాగే వుంచేసేను. నీకు తిరుబడి అవుతే మధ్యాహ్నము అవి ఆరవేయ్' అంటూ భోజనమునకు కూర్చుంది.

అబ్బబ్బ ఏమిటీ కూర! అసలిది కూరేనా? ఇంత కారం వేసుకుంటారా? అబ్బ అన్నమేమిటి ఇంత బిరుసుగా వండేవు. ఇవి తినటానికేనా? పారవేయడానికా. నీకు వంటచేతకాదని చెప్పకూడదు. నే నెలాగో వంట చేసి తగలడుదును.

ఏమిటి అలా సాధిస్తున్నావు మా చెల్లాయిని అంటూ రవి వంటింట్లోకి వచ్చేడు.

ఆ! ఏమీ లేదన్నయ్యా! భోజనము చేదువుగానిరా అంటూ లక్ష్మి భోజనము వడ్డించింది.

అన్నయ్యా, వదిన ఆఫీసులకు వెళ్ళినతరువాత లక్ష్మికి ఏమితోచలేదు. భోజనమునకు కూర్చుందన్న మాటేగాని



జయాపిక్చర్స్‌వారి "నాదేశం" చిత్రంలో ఎం. కె. విజయా, ధూళిపాళ, మాలతి.

ముద్దనోటపడలేదు. వదిన అన్నమాటలే చెవులలో మారు మ్రోగుతున్నాయి. ఇది క్రొత్తగాదు. వదిన ఎంత బాగుగా చేసిన యిలాగే అంటుంది. పోని నాకంటె పెద్దది నన్ను ఏమన్నా నా బాగుకోసమే అని మనసుసమాధాన పరచుకొంది.

♦ ♦ ♦

అది సంధ్యాకాలం. ఆకాశమంతా కుంకుమపూసి వుందా అన్నట్లు ఎర్రగా వున్నది. పడమటి దిక్కున సూర్యుడు ఎర్రటి బింబముతో ఎంతో అందముగా కనిపించుచున్నాడు. ఆకాశంపై పక్షులు బారులు తీరి ఎగురుచున్నవి. పశువులు గుంపులు గుంపులుగా నడచుచు వాటి ఇళ్ళకు చేరుకొనుటకు వెళ్ళుచున్నవి. చిన్నపిల్లలు చెడుగుడు, బంతి ఆటలు ఆడుకొనుచున్నారు. రోడ్డుమీద పచ్చేపోయేకార్ల రొద, తోటలోని సన్నజాజుల, గులాబీలు సోయగమును తిలకించుచు ప్రకృతి సౌందర్యమునకు ముగ్ధురాలై మైమరచి తోటలో కూర్చుంది లక్ష్మి.

ఉన్నట్టుండి కొద్దిగంటలక్రితం జరిగిన ఒక సంఘటన గుర్తుకొచ్చింది.

మాధవి! లక్ష్మి, నువ్వు త్వరగా తయారవండి. సినిమాకి టిక్కట్లు కొన్నాను.

'ఏమిటి! ఆ! సినిమాకి అప్పుడే టిక్కట్లకొనేశారా? ఆ లక్ష్మి ఎందుకు మనతో పానకంలో పుడకలా. మరోసారి తీసికెళ్ళొచ్చు లెండి. ఎన్నాళ్ళు అయింది మనిద్దరము కలిసి సినిమాకెళ్ళి, మనిద్దరం వెళదాం పదండి. కావలిస్తే నేను డబ్బులిచ్చి రేపుమాట్నీకి పంపుతాలెండి,

రచన:

శ్రీమతి ఎం. రమనమ్మ

అయినా మనం పిక్చర్‌నుంచి వచ్చేసరికి వంటచేసి ఎవరు వుంచుతారు.

మనిద్దరం వెళ్ళిపోతే చెల్లి యెంత బాధపడుతుంది. పాపం చెల్లినిగూడ తీసివెళదాం, అది బాధపడితే నేను చూడలేను.

అలాగయితే మీ చెల్లి, మీరు వెళ్ళండి నే నెందుకు మధ్య నేనురాను, అని మొండివేసింది మాధవి.

పోనీపద మనిద్దరమే వెళదాము పద! మళ్ళీ ఆదివారమువరకు మనిద్దరకు తీరుబడివుండదు. లక్ష్మిని పక్కింటి సుజాతతోనైనా పంపవచ్చు. త్వరగా తెములు అంటూ డ్రస్సువేసుకోసాగేడు.

ప్రక్క గదిలోనుంచి అన్నివిన్న లక్ష్మి కంటికి ఏకధారగా ఏడ్చినది. గట్టిగా ఏడిస్తే ఎక్కడ అన్నయ్య పసికడతాడోనని మనస్సులో నే బాధపడింది.

ఆలోచనలనుండి తేరుకున్న లక్ష్మికి తనకు తెలియకుండానే కన్నీరు కట్టలు తెరచుకొని బుగ్గలు మీదుగా ప్రవహించ సాగింది.

'భగవాన్ నాలాంటి నిర్భాగ్యురాలిని ఎందుకు పుట్టించావు. పుట్టించినా తల్లి తండ్రి లేనిదానిగా ఎందుకు పుట్టించావు. నా వేదన ఎవరితో చెప్పుకోను. అన్నయ్య

♦

ఎ. వి. ఎం. వారి

"చిట్టి చెల్లెలు"లో

ఒక దృశ్యం.

♦



వున్నాడంటే వదిన చెప్పుచేతలలో నడుచుకుంటూ ఆవిడ అడుగులకు మడుగులొత్తుతాడు. వదినపై ఇంటిపిల్ల. వదినను అనుకొన ప్రయోజనములేదు. అయినా ఎంతమంది స్త్రీలు తమ ఆడబిడ్డలను బాగుగా చూచుకోవటంలేదు. వదిన బుద్ధి అంతే! ఏం చేస్తాం అది నా ఖర్మ. పోని చదువైనా చదువుకున్నానుగాను వదినలా ఉద్యోగం చేసికొందును. నా జీవితమంతా జబ్బుతో వున్న తల్లికి సేవచేయటంతోటే గడిచిపోయింది. మిగతా జీవితం ఈ విడకి సేవలు చేయుటములోనే గడిచి పోతుందేమొ. వదిన పగలల్లా ఆఫీసులో వుద్యోగంచేసి వస్తుందికదా తను ఊరికినే కూర్చోడమెందుకని ఇంటిపని అంతా నేనే చేస్తున్నాను. దానికి కొంచము కూడ విశ్వాసములేకుండ నన్ను అనరానిమాటలు కూడ అంటుంది. తను కూడ ఒక ఇంటి ఆడపడుచే అని మరచిపోవుచున్నది. తనమీద అధికారం చెలాయిస్తున్నది. మా అమ్మే వుంటే వదిన నన్ను అన్ని మాటలు అనగలదా? అని దుఃఖించుచు గబగబా పరుగెత్తి మంచంమీదపడి భోరున ఏడ్చింది. కన్నీటికి ఆనకట్టలే లేవు.

♦ ♦ ♦ ♦

కాలప్రవాహంలో రోజులు, నెలలు, వారాలు, సంవత్సరాలు కొట్టుకు పోయేయి. ఈమధ్య కాలంలో లక్ష్మికి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. లక్ష్మిభర్త చాలా మంచివాడు. లక్ష్మిని ఎంతో అభిమానంగా చూచుకుంటాడు.

మాధవి! మీ పుట్టింటినుంచి వుత్తరము వచ్చినది.

ఏమండీ! నాన్నగారు ఏమని వ్రాసేరు.

ఆ ఏముంది: నా ఆరోగ్యం అంత బాగాలేదు. అమ్మని పంపటానికి వీలుపడదు అని రాసేరు అని క్లుప్తముగా వివరించేడు. తల్లితండ్రులు ఆడపిల్లల పెళ్ళితోనే తమ బాధ్యత తీరిందనుకుంటారు. న్యాయంగా వాళ్లు వచ్చి నిన్ను పుట్టింటికి పురుటికి తీసికెళ్ళవలసినది పోయి పురుడు పోయుటానికి రమ్మనమని వుత్తరం వ్రాసినా రాలేదు.

పోనీలెండి ఏం చేస్తాం రండి భోజనము పెట్టేశాను అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

చెల్లికి రమ్మనమని ఉత్తరం రాద్దామని అనుకుంటున్నాను. అన్నాడు అన్నం తింటూ.

ఇప్పటినుంచి వుత్తరం రాయడమెందుకు? ఇంకా మూడునెలలు టైం వుంది కదా అప్పుడు చూసుకుందాం లెండి. ఇంతలో మా అమ్మ రావచ్చేమో చెప్పలేం.

అలాగే లే నీయిష్టం అంటూ కంచంలో చేయి కడుగుకుని తన గదిలోని వెళ్లిపోయేడు రవి.

♦ ♦ ♦ ♦

'మాధవి సీరియస్. కమ్ ఇమిడియట్లీ' టెలిగ్రాం చదవగానే బయలుదేరింది లక్ష్మి.

ఆస్పత్రి ఆవరణలో ప్రవేశించగానే లక్ష్మి గుండెలు దడదడలాడ సాగేయి. ఎటువంటి వార్త వినవలసి వస్తుందోనని భయపడ సాగింది.

స్పృహలేకుండా బెడ్డుమీద వున్న వదినను చూచి లక్ష్మి నిశ్చేష్టురాలైంది.

డాక్టర్! మా వదినకు ఏమయింది డాక్టరు అంది లక్ష్మి కంగారుగా.

ఆ ఏమిలేదు. ఎబార్షన్ అయింది. ఇప్పుడు ఆమెకు రక్తం కావాలి: రక్తం ఎక్కిస్తే ఆమె బ్రతుకుటకు అవకాశ ముంది.

అయితే డాక్టర్ 'బ్లడ్ బ్యాంకు' నుంచి రక్తం తెప్పించండి లేకపోతే రక్తదానం చేసేవాళ్లు ఎవరైన వుంటే చూడండి. నేను కావలసిన డబ్బు ఇస్తాను.

అన్నిటికి ప్రయత్నం చేసేముకాని ఒక్కరు ముందుకు రాలేదు.

అయితే ఆలస్యం చేయకండి డాక్టర్ నా రక్తమియ్యండి. నా వదిన బ్రతకడంకన్నా నాకు కావలసినదేదిలేదు.

వదిన ప్రక్కయింటి ఆమె చెప్పగా అన్న ఆ సమయంలో ఊళ్ళోలేడని, క్యాంపులో వున్నాడని, తాము ఆస్పత్రిలో చేర్చి తనకు టెలిగ్రాం ఇచ్చేరని తెలిసినది.

మర్నాడు ఉదయముననే మాధవికి తెలివి వచ్చినది. తన ఎదురుగా నిలబడి ఆప్యాయంగా చూస్తున్న లక్ష్మిని చూచి ఆశ్చర్యపడింది.

ఎలా వున్నది వదినా! కాఫీ త్రాగు అంటూ మెల్లిగా కాఫీ త్రాగించినది,

ఇంతలో మాధవి... ఎలా వున్నది అంటూ రవి వచ్చి బెడ్డు దగ్గరగా బల్ల లాగుకొని కూర్చున్నాడు.

బాగానే వున్నదన్నయ్యా. ఇంకేం ఫరవాలేదని డాక్టరు చెప్పేరు.

అమ్మా లక్ష్మీ! నీవువచ్చి మీ వదినని కాపాడి, నా యిల్లు నిలబెట్టేవు. నీ ఋణం తీర్చుకోలేనమ్మా.

ఆ! ఏం జరిగింది... మాధవి అడిగింది.

మాధవి నీవు స్పృహలో లేనప్పుడు లక్ష్మి వచ్చి నీకు రక్తదానం చేసి నీ ప్రాణం కాపాడింది. నీకు అన్ని పరిచర్యలు చేసింది. నీకు ప్రాణదాత అయింది. ఇక్కడకు వచ్చేముందు డాక్టరును కలిస్తే ఇవన్నీ చెప్పేరు. నా చెల్లి నిజంగా దేవత.

అన్నీ విన్న మాధవి లక్ష్మీ అంటూ లక్ష్మిని కౌగలించుకొని ఆనంద భాష్పాలు రాల్చింది.

నిజంగా నేనెంత అదృష్టవంతురాలను లక్ష్మీ. నీ లాంటి ఆడపడుచు దొరకటం నా పూర్వజన్మ పుణ్యమే. ఎవ్వరు చేయని త్యాగం చేసేవు. నీకు జన్మ జన్మలకి ఋణపడివుంటాను. ఆడపిల్లల అవసరాలకి తల్లిదండ్రులే ఆదుకుంటారని ఇన్నాల్లు అనుకున్నాను. అది వుట్టి భ్రమ. పెళ్లైన తరువాత పుట్టింటివారికంటె అత్తింటివారికే మమతానురాగాలు వుంటాయని ఇప్పుడు తెలుసుకున్నాను. ఆడపడుచు అంటే లోకంలో అందరికి ఆడపడుచులులాగా సాధించేదానవు అనుకొని నిన్ను చాలా కఠినంగా మాటలతో బాధించేను. ఇప్పుడు తెలిసికున్నాను, తెలుగు ఆడపడుచులందరిలో మణిపూసలాంటి దానవని. నన్ను క్షమించు లక్ష్మీ.

అదేంటి వదినా! మనలో మనకి క్షమాపణ లేమిటి.

అదేం కుదరదు. నీవు క్షమించేనంటేగాని ఈ నీ వదినకు మనసు కుదుటపడదు.

'అయితే క్షమించేనులే.' అదేంటి వదినా ఏడుస్తున్నావా అంటూ కళ్లు తుడవసాగింది.

ఇది ఏడుపు కాదమ్మా ఆనంద భాష్పాలు.

వారిద్దరి ఆప్యాయత, అనురాగాలకు ముగ్ధుడై వారిద్దరిని చూస్తు మైమరచిపోయేడు రవి.

కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
[స్థాపితము 1938]
విడి ప్రతి ... 25 పై.
సంవత్సర చందా ... రూ 5-00
(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్సులోనూ దొరకును.

మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
సవరన్ మార్కు
REGISTERED-TRADE-MARK
No:115228
పారిస్ వజ్రములు
వివరములకు
PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI — 8
పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి — 8